క్లుప్తంగా...

ఉత్తమ ఎంపీడీఓగా పద్మావతి



ప్రశంసా పత్రం అందుకుంటూ..

మేడ్చల్: జిల్లాలో ఉత్తమ ఎంపీడీఓగా మేడ్చల్ ఎంపీడీఓ పద్మావతి ఎంపికయ్యారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆమెను జిల్లా అధికారులు ఉత్తమ అధికారిగా ఎంపిక చేశారు. కలెక్టర్ భవనంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి మల్లారెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

ఉత్తమ కమిషనర్‌గా సురేష్..



పోచారం: పోచారం మున్సిపల్ కమిషనర్ ఎ.సురేష్ ఉత్తమ కమిషనర్ అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి చామకూర మల్లారెడ్డి అవార్డు అందజేశారు. పారిశుద్ధ్య విభాగంలో జే.శివారెడ్డి, సిస్టం ఆపరేటర్ బి.సాయికిరణ్‌కు జిల్లా మెరిటోరియస్ అవార్డులు లభించాయి.

ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్‌కు..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్‌కు శుక్రవారం మంత్రి చామకూర మల్లారెడ్డి, జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రశంసాపత్రం అందజేశారు.



పారిశ్రామిక అభివృద్ధిలో మేడ్చల్ నంబర్ వన్

కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

శామీర్‌పేట్: పారిశ్రామిక అభివృద్ధిలో రాష్ట్రంలోనే మేడ్చల్ జిల్లా నంబర్ వన్ స్థానంలో ఉందని, జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు కృషిచేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దశాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు రూ.18.35 కోట్ల నిధుల చెక్కును డీఆర్‌డీఏ పీడీ పద్మజారాణికి మంత్రి మల్లారెడ్డి అందజేశారు. మెప్మా వారికి రూ.16.61 కోట్ల చెక్కును పీడీ అనిల్‌కు అందజేశారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఈ నిధులను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు వృథా కాలేదని, బంగారు తెలంగాణగా అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాష్ట్రంలో అనుసరిస్తున్న విధానాలు దేశమంతా అనుసరిస్తున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాల ద్వారా రైతు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ అధికారులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, సీపీ స్టీఫెన్ రవీంద్ర, అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు రవి, మల్లయ్యతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రియాశీల రాజకీయాల్లోకి కేఎల్ఆర్



నగరంలో గన్‌పార్క్ కార్యక్రమంలో కేఎల్ఆర్

మేడ్చల్: రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడైనప్పటి నుంచి రాజకీయాలకు, కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్న మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ మాజీ సభ్యుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్) తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో లోకసభ మాజీ స్పీకర్ మీరాకుమార్ పర్యటనలో ఆయన పాల్గొన్నారు. మీరాకుమార్ పర్యటనకు ఆయన ఇన్‌చార్జిగా ఉండి గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులర్పించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. చేవెళ్ల ప్రాంతానికి చెందిన కేఎల్ఆర్ 2009లో దివగంత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో మేడ్చల్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా విజయం సాధించాడు. ఆ తర్వాత జరిగిన 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయాడు. అప్పటివరకు నియోజకవర్గంతో టచ్‌లో ఉన్నాడు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడని ఏఐసీసీ నుంచి ప్రకటన వెలువడగానే రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆయన మొదట ధిక్కార స్వరం వినిపించి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. రాజీనామా ఆమోదం కాకున్నా ఆయన పార్టీకి, నియోజకవర్గానికి, రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండిపోయారు. ఇటీవల నేతల పునరేకీకరణలో భాగంగా పీసీసీ దూతలు ఆయన నివాసానికి వెళ్లి రేవంత్‌తో మాట్లాడించడంతో ఆయన అలకపాన్పు దిగారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకుడు కావడంతో రాబోయే ఎన్నికల్లో మేడ్చల్ నుంచి పోటీ చేస్తారా, లేదంటే ఇతర నియోజకవర్గాలకు వెళతారా, ఎంపీకి పోటీ చేస్తారా అనేది ఆయన స్పష్టం చేయాల్సి ఉంది. మేడ్చల్ కాంగ్రెస్‌లో హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్‌ల రూపంలో ఇప్పటికే రెండు వర్గాలు పోటీ పడుతుండగా కేఎల్ఆర్ పునరాగమనంతో మేడ్చల్ కాంగ్రెస్ మరో గ్రూపు పురుడుపోసుకుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన అంతమే ధ్యేయం



కీసర: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ రాక్షస పాలనలను అంతమొందించడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి ప్రజల వద్దకు వెళ్తోందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుతూ కీసరగుట్టలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అనంతరం కీసర చౌరస్తాలో సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. మేడ్చల్ బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్, జవహర్‌నగర్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి, జిల్లా బీసీ సెల్ చైర్మన్ రవిముదిరాజ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేందర్‌ముదిరాజ్, కీసర మండల నాయకులు జూపల్లి రవీందర్, దయానంద్‌గౌడ్, చిక్కుడు రమేష్‌ముదిరాజ్, కందాడి సత్తిరెడ్డి, శ్రీశైలం, బాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



జవహర్‌నగర్: మాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో రణవీర్ తైక్వాండో అకాడమీ బెల్టుల ప్రదానోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన తైక్వాండో పరీక్షలో జవహర్‌నగర్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆర్టీఏ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. మాస్టర్ రమేష్ మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు.

కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ



కార్మికులకు సరుకులు అందజేస్తున్న సర్పంచ్ గీతరెడ్డి

మేడ్చల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో పంచాయతీ కార్మికులకు గ్రామ సర్పంచ్ గీత భాగ్యారెడ్డి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులను సన్మానించి తన సొంత నిధులతో వాటిని అందజేశారు. 19 మంది కార్మికులకు బట్టలు పెట్టి, శాలువాలతో సన్మానించారు. ఉపసర్పంచ్ సత్యనారయణ, ఎంపీటీసీ హేమలత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాఘవేంద్రనగర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న కాలనీ వాసులు

మేడ్చల్: పట్టణ పరిధిలోని అత్వెల్లి రాఘవేంద్రనగర్‌లో కాలనీవాసులు రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణంలోని ప్రజ్ఞ ఆసుపత్రి సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించగా కాలనీవాసులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జాకట దేవరాజు, నర్సింహస్వామి యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, సత్యపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘దశాబ్ది’ సంబురం

కీసర: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కీసరలో అమరవీరుల స్థూపం వద్ద మంత్రి చామకూర మల్లారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలుచేస్తూ దేశానికే తెలంగాణ మోడల్‌గా నిలిచిందన్నారు. కలెక్టర్ అమయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, పోలీస్ అధికారులు సత్యనారాయణ, రవీంద్ర, వైస్‌చైర్మన్లు మల్లేష్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, సర్పంచులు మాధురి, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తటాకం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాగారం సెరినిటీ పాఠశాలలో..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సెరినిటీ పాఠశాల్లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఇదిలా వుండగా రాంపల్లిలోని కేజీఆర్‌కళాశాల్లో కుడా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, పాఠశాల ముఖ్యకార్యదర్శినోముల వసంత, కేజీఆర్‌కళాశాల చైర్మెన్ కె. గోవిందర్‌రెడ్డి, డైరెక్టర్ పి.వి.రమణారావు, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, తదితరుల పాల్గొన్నారు.

శామీర్‌పేట్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాడవాడలా రాష్ట్ర అవతరణ వేడుకలు, దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట, మూడు చింతలపల్లి మండలాల్లోని గ్రామాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛందసంస్థల కార్యాలయాల ఎదుట జాతీయ జెండాను ఎగురవేశారు.



కీసరలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు



జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో జెండావిష్కరిస్తున్న మేయర్ కావ్య



తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో చైర్ పర్సన్ పావనిజంగయ్య



ప్రతాపసింగారం రైతువేదిక వద్ద అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



కొర్రెముల్‌లో సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్



మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రజితరెడ్డి



నూతన్‌కల్‌లో సర్పంచ్ కవిత జీవన్



పోచారం మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో జాతీయ జెండా ఎగుర వేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి



గుండ్లపోచంపల్లిలో వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, నాయకులు



రాజబొల్లారం పంచాయతీ కార్యాలయం వద్ద పాలకవర్గ సభ్యులు



కీసర ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ ఇందిరా



నాగారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు



దమ్మాయిగూడలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు



మూడుచింతలపల్లిలో..



తూంకుంట మున్సిపాలిటీలో చైర్మన్ రాజేశ్వరరావు



నాగారం సెరినిటీ పాఠశాల్లో అవతరణ వేడుకలు

‘ప్రొటోకాల్ పాటించకుండా అవమానించారు’



ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు ఆహ్వానించకుండా కావాలనే అధికారులు అవమానించారని ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేడుకలకు ఆహ్వానం పంపారని, ఈ సంవత్సరం సమాచారం ఇవ్వకుండా అధికార పార్టీ తొత్తులుగా అధికారులు పనిచేస్తున్నారని ఆరోపించారు. రాక్షస పాలనకు ఇది నిదర్శనం అన్నారు. ప్రశ్నించిన వారిని అణిచివేసే ధోరణిని అవలంభిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తల్లా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపీపీకి ఆహ్వానం పంపకపోవడం ఎంత వరకు సమంజసమని, అధికార పార్టీ నాయకులు చెప్పిందల్లా చేయకుండా పునరాలోచన చేసుకోవాలని సూచించారు.

అందుబాటులో ఆక్సిజన్ సిలిండర్లు



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో రోగుల కోసం ఆక్సిజన్ సిలిండర్లను శుక్రవారం నుంచి అందుబాటులో ఉంచామని టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ బి.హరిప్రసాదరావు తెలిపారు. సిలిండర్లను అసోసియేషన్ కార్యాలయంలో ఉంచామని, కావాల్సిన వారు వినియోగించుకోవచ్చని చెప్పారు.

మినీ ఫంక్షన్ హాల్‌కు భూమిపూజ

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామంలో మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో సర్వే నంబర్-38లో గ్రామస్తుల కోసం మినీ ఫంక్షన్‌హాల్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో గ్రామ ఎంపీటీసీ అంకిత, మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వార్డు సభ్యులు శుక్రవారం భూమిపూజ చేశారు.



నేడు రైతు దినోత్సవ కార్యక్రమాలు

కీసర: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం కీసర, యాద్గార్‌పల్లి గ్రామాల్లోని రైతు వేదికల వద్ద రైతు దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని, కీసర మండల వ్యవసాయాధికారి మాధవిలత తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే రైతు దినోత్సవ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆమె కోరారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు



జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు



తూంకుంట మున్సిపాలిటీలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



ఘట్‌కేసర్‌లో సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ముత్యాలుయాదవ్



గుండ్లపోచంపల్లిలో సోనియా చిత్రపటం వద్ద కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు